క్లుప్తంగా

కొనసాగుతున్న సెర్చ్

పలిమెల: మూడు రోజులుగా పలిమెల రేంజ్ పరిధిలోని కామన్‌పల్లి సెక్షన్‌లో పులి కోసం అన్వేషణ కొనసాగుతుంది. ఫారెస్టు ఆఫీసర్ నాగరాజు ఆధ్వర్యంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుంది. మూడు రోజుల తనిఖీల్లో పులి అనవాళ్లు, పాదముద్రలు కనిపించలేదని అధికారులు తెలిపారు. పలిమెల రేంజ్ పరిధిలో పూర్తిగా తనిఖీ చేశాకే పులి ఉందా.. లేదా అనే నిర్ధారణకు వస్తామని తెలిపారు.

హైనా పాదముద్రల గుర్తింపు..



పులి కోసం గాలిస్తుండగా పశువుల కాపర్లు పులిని చూశామని తెలపగా ఆ ప్రాంతంలో తిరుగుతుండగా హైనా పాదముద్రలు కనిపించినట్లు రేంజ్ ఆఫీసర్ నాగరాజు తెలిపారు. గతంలో మూడు, నాలుగు సంవత్సరాల క్రితం సర్వాయిపేట పంట చేలల్లో హైనా సంచరించినట్లు గతంలో అటవీ శాఖ అధికారులు తెలిపారు.

సేవలు వినియోగించుకోవాలి



కాళేశ్వరం: కాళేశ్వరంతోపాటు మహారాష్ట్ర పరిధి సిరొంచ గ్రామాల ప్రజలు టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలను వినియోగించుకోవాలని లాజిస్టిక్స్ ఏటీఎం వి.రామారావు, ఏరియా కరీంనగర్ రీజనల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ బి.రాజు తెలిపారు. గురువారం వారు కాళేశ్వరంలోని లాజిస్టిక్స్ సెంటర్‌ను సందర్శించారు. కాళేశ్వరం లాజిస్టిక్స్ ఏజెంట్ పెనగొండ రాజుకు హైదరాబాద్‌లోని హోం డెలివరీలపై సూచనలు అందజేశారు.

సెల్‌ఫోన్ అందజేత

టేకుమట్ల: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన ఏకు సునీల్ ఇటీవల సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకి తెలుసుకుని గురువారం సునీల్‌కు అందిచినట్లు ఎస్సై గోగికారి ప్రసాద్ తెలిపారు.

బ్యాంకర్లు భద్రతా చర్యలు తీసుకోవాలి

టేకుమట్ల: ప్రతీ బ్యాంక్‌లో బ్యాంక్ అధికారులు తప్పనిసరిగా భద్రతా చర్యలు తీసుకోవాలని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని యూనియన్, ఏపీజీవీబీలో భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల వరంగల్ జిల్లా రాయపర్తి బ్యాంక్‌లో సుమారు రూ.10కోట్ల విలువ చేసే బంగారు నగలను దుండగులు అపహరించారన్నారు. కావున అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు బ్యాంక్ అధికారులు నిత్యం సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

పలిమెల: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను నూటికి నూరు శాతం అమలు చేస్తున్న కూడా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు వాటిపై అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిన్నన్న తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజలందరూ సంతోషంగా ఉన్న సమయంలో రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ పథకాలపై అసత్య ప్రచారాలు చేయడం సరికాదన్నారు. మండల యూత్ అధ్యక్షుడు దందేర రాజేందర్, జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, మాజీ సర్పంచ్ మల్లయ్య, దాసరి రాజేష్, జేయాకర్ రాజారామ్, సంతోష్ పాల్గొన్నారు.

పరామర్శ

రేగొండ: మండలంలోని కనిపర్తి గ్రామానికి చెందిన గువ్వ మొగిళి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు దాసరి తిరుపతిరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గాలిఫ్, మండల ప్రధాన కార్యదర్శి పెండ్యాల రాజు, ఉపాధ్యక్షులు జాలిగపు రాజయ్య, నాయకులు సాదు దేవేందర్, మధు, రాకేష్ ఉన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో గాయలైన మండలంలోని గిద్దెముత్తారం గ్రామానికి చెందిన శుద్ధపల్లి పవన్(24) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఎస్సై శ్రావన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 11న కూలీల కోసం పక్క గ్రామమైన కాల్వపల్లికి వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోగా తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు అతడిని 108లో స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి కమలాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గైనిక్ డాక్టర్లు లేరు..!



చిట్యాలలోని సివిల్ ఆస్పత్రి



బోసిపోతున్న బాలింతల వార్డు

- సివిల్ ఆస్పత్రిలో గర్భిణులకు అందని వైద్య సేవలు
- వెలవెలబోతున్న బాలింతల వార్డు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



నిరుపయోగంగా పిల్లల బరువు కొలత మిషన్లు

చిట్యాల: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సివిల్ ఆస్పత్రి)లో గైనకాలజిస్ట్ డాక్టర్లు లేక మూడు నెలలు అవుతున్న కనీసం పట్టించుకునే నాథుడే లేరు. ఎలాంటి ఆపద వచ్చిన జిల్లా కేంద్రానికి పోవాల్సిందేనా అంటూ గర్భిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు సివిల్ ఆస్పత్రి అంటే రాష్ట్ర స్థాయిలో పేరుగాంచింది. కానీ ప్రస్తుతం స్త్రీల వైద్యులు లేక బాలింతల వార్డు వెలవెలబోతుంది. సిబ్బంది ఫుల్‌గా ఉన్న వైద్యులు లేకపోవడంతో ఆస్పత్రి చిన్నబోయింది. మండలంలో ఎవరికైనా పురిటి నొప్పులు వస్తే జిల్లా కేంద్రానికి పోవాల్సిన పరిస్థితి. విద్యా, వైద్య రంగాలల్లో ప్రభుత్వం ప్రత్యేక చొరవ కనబరుస్తుందని ప్రజాప్రతినిధులు చెప్పడం మాత్రమే.. ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. ప్రభుత్వం వైద్య సేవల అమలులో పూర్తిగా వైఫల్యం చెందిందనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. గత ప్రభుత్వం మండలంలో ఉన్న 30 పడకల ఆస్పత్రిని 50 పడకలుగా అప్‌గ్రేడ్ చేసింది. ఇందుకు సంబంధించిన వైద్యులను మాత్రం కేటాయించలేదు. గతంలో ఉన్న వైద్యులు అంకితభావంతో పని చేసి రాష్ట్ర స్థాయి అవార్డులను కైవసం చేసుకుని ప్రభుత్వ ఆస్పత్రి సేవలను రాష్ట్ర వ్యాప్తంగా చాటారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఇందుకు భిన్నంగా వైద్య సేవలు కనుమరుగై ఆస్పత్రి పలు విమర్శలకు తావిస్తోంది. కేవలం ఆరుగురు వైద్యులు దశల వారిగా వైద్య సేవలు అందిస్తున్నారు. అత్యవసర సేవల కోసం జిల్లా ఆస్పత్రికి తరలించడం సర్వసాధారణమైంది. ప్రధానంగా గర్భిణుల వైద్య సేవలు పూర్తిగా అందకుండా పోవడం వల్ల ప్రజలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన గైనకాలజిస్ట్ వైద్యులు బదిలపై వెళ్లడం వల్ల ప్రస్తుతం వైద్యులు లేకపోవడంతో గర్భిణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో ప్రసవాల ప్రస్తవానే లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వం, కలెక్టర్ స్పందించి మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రిలో వైద్యులను నియమించి నిరుపేదలకు వైద్య సేవలు అందించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వైద్యులను కేటాయించాలి



మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రిలో గత కొంతకాలం నుంచి గర్భిణిలకు వైద్య సేవలు నిర్వహించడం లేదు. గర్భిణులు పట్టణాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాల్సిన దుస్థితి నెలకోంది. కలెక్టర్ స్పందించి స్త్రీల వైద్యనిపుణుతో పాటు పలు రకాల వైద్యులను కేటాయించాలి.

- మల్లేశ్,
సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి

దళారులను నమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి అర్బన్: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు సన్న ధాన్యానికి రూ.500వందల బోనసు అందిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా రూ.2లక్షలలోపు రైతు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాసులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

వరుస చోరీల కేసు ఛేదింపు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లేశ్, ఎస్సై అశోక్

గణపురం : మండలకేంద్రంలో 15 రోజుల క్రితం జరిగిన వరుస చోరీల కేసును పోలీసులు ఛేదించారు. ఒకే కాలనీలో రెండు రోజుల్లో 8 ఇళ్లలో చోరీకి పాల్పడి బంగారు, వెండి ఆభరణాలను అపహరించిన ఓ బాలుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు గణపురం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిట్యాల సీఐ మల్లేశ్, గణపురం ఎస్సై అశోక్ వివరాలు వెల్లడించారు. మండలకేంద్రానికి చెందిన ఓ బాలుడు ఆన్‌లైన్ బెట్టింగ్, కోడి పందేలు, మద్యం తాగడం వంటి జల్సాలకు అలవాటు పడ్డాడు. డబ్బులు లేకపోవడంతో తాము నివాసం ఉండే కాలనీలోనే ఇళ్లలో చోరీకి పాల్పడ్డాడు. తనపై అనుమానం కలగకుండా తమ ఇంట్లో కూడా చోరీ జరిగినట్లు తలుపులు, బీరువాను పగలకొట్టి నమ్మించాడు. వరుస చోరీల ఘటనపై పోలీసులు రంగంలోకి దిగారు. ఈ క్రమంలో గురువారం మండలకేంద్రంలోని మార్కెట్ ప్రాంతంలో ఓ బాలుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. తన తండ్రి సౌదీ అరేబియాదేశానికి వెళ్లగా తన తల్లి గ్రామాల్లో స్టీల్ వ్యాపారం చేస్తోందన్నారు. ఇంట్లో తాను ఒక్కడే ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్నట్లు తెలిపాడు. డబ్బులు లేకపోడంతో తానే ఎస్‌కే చోటేమియా, అతడి కుమారులు ఎస్‌కె జానీ, ఎస్‌కె మొయినొద్దీన్ ఇళ్లతోపాటు ఎస్‌కె సలీం, ఎస్‌కె చాంద్‌పాషా, కనుకుంట్ల శైలజ, కనుకుంట్ల నరేశ్ ఇళ్లలో వరుస చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో బాలుడి నుంచి 25 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ. 4500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ, ఎస్సై తెలిపారు.

'రెడ్డి గాండ్ల కులస్తులను బీసీలుగా గుర్తించొద్దు'



కాళేశ్వరం: వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాళేశ్వరం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రెడ్డి గాండ్ల కులస్తులను బీసీలుగా గుర్తించొద్దని కాటారం డివిజన్‌లోని బీసీ కులసంఘాల నేతలు తెలంగాణ వెనుకబడిన తరగతుల డేడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్లుకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల నాయకులు ఆత్మకూరి స్వామి యాదవ్, సముద్రాల తిరుపతి, విజయగిరి సమ్మయ్య, ముక్కెర వినోద్ గౌడ్, వెన్నంపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలి

మల్హర్: బీసీల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర బీసీ కులగణన డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్లుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ విజయగిరి సమయ్య వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ.. బీసీ జనగణనతో పాటు కులగణన చేసి ఏ,బీ,సీ,డీలుగా చట్టసభల్లో, స్థానిక సంస్థలలో ఉద్యోగ విద్య నియామకాలలో జనాభా తమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

ఘనంగా మత్స్యకారుల దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న సురేష్

మల్హర్: మండలంలోని తాడిచర్లలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ముదిరాజ్ కులస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా యువత ఉపాధ్యక్షుడు ముద్రవేణి సురేశ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీతో తరలి వచ్చి జెండా ఆవిష్కరించారు. అనంతరం సురేశ్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏకు మార్చాలని డిమాండ్ చేశారు. కారుపాకల శంకర్, ఆకుల నర్సింగం, ఆకుల పర్వతాలు, గోస్కుల లక్ష్మయ్య, తాడిచర్ల సొసైటీ చైర్మన్ భువనగిరి ఓదెలు, మండల ప్రధాన కార్యదర్శి చొప్పరి రాజు, మండల యువత అధ్యక్షుడు ఆకుల సతీష్, మండల ఉపాధ్యక్షుడు కుంట సదానందం, ప్రచార కార్యదర్శి బోనగిరి లక్ష్మణ్, ముఖ్య సలహాదారు ఆకుల నరేష్, గ్రామ అధ్యక్షుడు బొంతల శంకర్, గ్రామ యూత్ అధ్యక్షుడు ముద్రవేణి నితిన్ ఉన్నారు.

మహాలక్ష్మికి చేయూత



నగదు అందజేస్తున్న భిక్షపతి

టేకుమట్ల: మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన దంద్రె రమేష్-కవిత కుమార్తె మహాలక్ష్మికి లివర్ సంబంధిత వ్యాధితో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ జరిగి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. గురువారం చిట్యాల సాంఘిక సంక్షేమ గురుకుల (వెలుగు) పాఠశాల ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి ఆస్పత్రిలో మహాలక్ష్మిని పరామర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సాయంతో పోగు చేసిన రూ.71వేలను మహాలక్ష్మి తల్లిదండ్రులకు అందించారు. వైద్య ఖర్చు కోసం మరింత ఆర్థిక సాయాన్ని అందిస్తామని భరోసా కల్పించారు. ఆయన వెంట గురుకుల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు సంగి రవి, కస్నూరి రమేష్, కొలుగూరి కైరత్, సుంకరపెల్లి దేవేందర్ ఉన్నారు.

'ప్రజాపాలన'పై కళాజాతా

టేకుమట్ల: కాంగ్రెస్ ప్రజా పాలన విజయోత్సవాలు-2024పై గురువారం మండల కేంద్రంలో సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కళాకారులు కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై పాటల ద్వారా ప్రజలకు వివరించారు భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు వెన్నెల వెంకన్న, రవి, యాకూబ్, శ్యామల, పాల్గొన్నారు.

రోడ్డంతా మాదే!



మహదేవపూర్ మండలం కాళేశ్వరం నుంచి మద్దులపల్లి, పలుగుల వరకు రోడ్లపై ఇసుక లారీలను డ్రైవర్లు రెండు వరుసల్లో విచ్చలవిడిగా నడిపిస్తూ రోడ్డంతా మాదే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. గురువారం ఆయా గ్రామాల మీదుగా ప్రయాణించే జనం దారిలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాళేశ్వరం టు మద్దులపల్లి వరకు రెండు వరుసల్లో రోడ్డుపై రెండు వైపులా లారీలను డ్రైవర్లు ఆక్రమించడంతో మద్దులపల్లి, పలుగుల, కుంట్లం గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. సంబంధిత టీజీఎండీసీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

- కాళేశ్వరం

కోడి పందేల స్థావరంపై దాడి



కాటారం: మండలంలోని దామెరకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లారం శివారులో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరాలపై సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు, స్థానిక పోలీసులు సంయుక్తంగా గురువారం దాడులు నిర్వహించారు. కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. ఈ దాడిలోల రూ.11వేల నగదు, 8 కోళ్లు, ఆరు సెల్‌ఫోల్‌లు స్వాధీనపర్చుకొని సురేందర్, సత్తయ్య, షాకీర్, శేఖర్, రేజేశ్, రాజబాబు, గోవర్ధన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వారిని కోర్టులో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

- సీపీఎం నేతలు నాగయ్య, వెంకటేష్



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేష్ అన్నారు. సీపీఎం జిల్లా మూడో మహాసభ గురువారం జిల్లా కేంద్రంలో ప్రారంభమైంది. అంతకు ముందు పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ మీదగా కమ్యూనిటీహాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంపేటి రాజయ్య జెండా ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నివాలులు అర్పించారు. మహాసభకు వెలిశెట్టి రాజయ్య అధ్యక్షతన వహించగా నాగయ్య, వెంకటేష్ మాట్లాడారు. అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాకు రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేయాలన్నారు. సింగరేణి జెన్కో ఆధారిత పరిశ్రమలైన బొగ్గు శుద్ధి కర్మాగారాలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఇంజనీరింగ్, బీఈడీ, లా కళాశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గు బ్లాగులను కేంద్ర ప్రభుత్వం వేలం వేసే పద్ధతిని మానుకోవాలన్నారు. పట్టణంలోని పాత ఎర్ర చెరువులో గుడిసెలు వేసిన పేదలందరికీ ఇంటి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బందు సాయిలు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చెన్నూరు రమేష్, పోలం రాజేందర్, గుర్రం దేవేందర్, మహాసభ ప్రతినిధులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు



మాట్లాడుతున్న సీఐ రామచందర్‌రావు

పలిమెల: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మహదేవ్‌పూర్ సీఐ రామచందర్‌రావు హెచ్చరించారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా గురువారం మండలంలోని మోదేడు గ్రామాన్ని పలిమెల ఎస్సై తమాషారెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో సీఐ రాంచందర్‌రావు మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు ఎవరూ కూడా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని, చట్ట వ్యతిరేక పనులు చేసేవారికి కూడా సహకరించవద్దని సూచించారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అటవీ జంతువుల కోసం విద్యుత్ తీగలను అమర్చడం కానీ, వేటాడటం కాని చేయొద్దని తెలిపారు. పిల్లన్ని బాగా చదివించాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్, టీజీఎస్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

మటన్, చికెన్ షాపులను తొలగించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్నటువంటి మటన్, చికెన్ షాపులను తొలగించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సొత్కు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మటన్, చికెన్ సెంటర్లు పరిశుభ్రత పాటించడం లేదని ఆరోపించారు. మేకలను పశువైద్యాధికారి ధృవీకరించకముందే విచ్చలవిడిగా విక్రయాలు చేపడుతున్ననట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో స్లాటర్‌హౌజ్ నిర్మించాలని అసంపూర్తిగా నిలిపోయిన సమీకృత మార్కెట్ సముదాయ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు క్యాతరాజు సతీష్, చంద్రమౌళి, శ్రీకాంత్, జోసెఫ్, రవి, రమేశ్, తిరుపతి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

చిట్యాల: యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దని దానికి మూలంగా కుటుంబాలు విచ్ఛిన్నం అవుతాయని ఎంపీడీఓ జయశ్రీ, ఎస్సై ఎండీ.శాఖాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నిర్మూలన మానవ సమాజానికి ఎంతో ముఖ్యమని అన్నారు. మనం అభివృద్ధి చెందాలంటే ప్రథమంగా ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే యువత ఏదైనా సాధించవచ్చని అన్నారు. డ్రగ్స్ మహామ్మారిని అందరం కలిసికట్టుగా తరిమికొట్టాలని అన్నారు. అనంతరం చెకుముకి మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కొడెపాక రఘుపతి, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీదేవి, ఎంపీఓ రామకృష్ణ, ఉపాధ్యాయులు బుర్ర సదయ్య, నీలిమారెడ్డి రాజమౌళి, బండారి సదయ్య, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సూదం సాంబమూర్తి పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవాలి



టేకుమట్ల: మెమొంటో అందిస్తున్న అధికారులు



మొగుళ్లపల్లి: గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవాలని అధికారులు, ఉపాధ్యాయులు అన్నారు. జిల్లా వ్యాప్తంగా గురువారం మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో నిర్వహించిన చెక్‌ముకి పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేసి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూఢనమ్మకాలను ప్రారదోలి, ప్రశ్నించేతత్వం, పోటితత్వం పెంపొందేలా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



చిట్యాల: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



కాళేశ్వరంలో..



కాటారంలో..